# జీవితమే ఓ నాటకం

"అమ్మా" వనజ కేకతో ఆ గది ప్రతిధ్వనించింది. " నిన్ను ఒంటరిదాన్ని చేసి పోతున్నందుకు నాకు బాధగా వుంది తల్లీ..." ఆయాసపడుతూ వొణుకుతూన్న చేతుల్తో కూతురి చేయి పట్టుకుంది పార్వతమ్మ.

" అమ్మా — నువ్వలా మాట్లాడకమ్మా....నువ్వ బతుకుతావు....నూరేళ్ళూ బతుకుతావు....నన్నొంటరిదాన్ని చేసి వెళ్ళిపోకమ్మా " వనజ చెంపలమీద కన్నీటి కాలువలు కట్టాయి

" పిచ్చి తల్లీ – నా పోయే ప్రాణం మీద నీకింకా ఆశ వుందా ? డాక్టర్నెందుకు తీసుకురావడం, వాళ్ళు రాసిచ్చే మందులు కొనే తాహతు మనకుందా అంటే విన్నావు కాదు. ఆదుర్దాకొద్దీ డాక్టర్ని తీసుకొచ్చావింటికి. కానీ, ఆయన రాసిచ్చిన మందులు ఏం పెట్టి కొంటావు ? ఎలా కొంటావు ? ఈ ఇంట్లో తాకట్టు పెట్టడానిక్కూడా ఏమీ మిగల్లేదు. నువ్వూ, నేనూ ఉన్నాం ఇంక " వెర్రిదానిలా నవ్వింది పార్వతమ్మ. అది నవ్వలా లేదు – ఎండిన పెదవుల విరుపే అది.

మెల్లిగా, మగతలోకి జారిపోతున్న తల్లిని చూస్తుంటే దుఃఖం, ఆవేదన కట్టలు తెంచుకొస్తోంది వనజకి.

"ఎలా ఉందమ్మా మీ అమ్మకి ? అన్నపూర్ణమ్మ లోపలికి తొంగిచూసింది, నాలుగిళ్ళ అవతలుంది అన్నపూర్ణమ్మ గుడిసె.

"నాకు భయంగా వుంది మామ్మా" కళ్ళనీళ్ళతో దిగులుగా చూసింది వనజ.

"డాక్టరేమన్నాడు ?"

"మందులు రాసిచ్చాడు మామ్మా ! అవి తొందరగా కొని వాడడం మొదలుపెట్టకపోతే ప్రాణానికి ముప్పు" అని చెప్పేశాడు. రెండు చేతుల్తో ముఖం కప్పుకుని మరి మాట్లాడలేకపోయింది.

ఓదార్పుగా భుజంమ్మీద చెయ్యి వేసింది అన్నపూర్ణమ్మ. "భయపడకు తల్లీ - అన్నిటికీ ఆ దేవుడే వున్నాడు. పక్కింటిలో నువ్వు వస్తుంటే చూడుతున్నా, కన్నతల్లికి మందిప్పించుకోలేక బాధ పడుతున్నా చూస్తూ జాలిపడడమే తప్ప, సాయం చెయ్యగల స్థితిలో నేనూ లేను తల్లీ. వయసులో వున్నప్పుడు ఏం సంపాయించానో, అంతే - ఇప్పుడు కొన్ని సంవత్సరాలుగా ఏ రోజు కారోజు ఎలా గడుస్తుందా అన్న చింతతోనే గడుస్తోంది" ఒక్క నిమిషం చెప్పడం ఆపింది.

"చెప్పిందే చెప్పి నిన్ను విసిగిస్తున్నానని అనుకోకు. కన్నతల్లి ప్రాణం ముఖ్యం కదా ! ఆ మందులకి సరిపోయే డబ్బు సంపాయించడం ముఖ్యం. మానం, అభిమానం అంటూ కూచుంటే ఇవతల, తల్లి ప్రాణం దక్కేదెలా ? ఉన్న ఈ ఒక్కతోడూ కూడా పోతే నీకు జీవితంమీద విరక్తి పుట్టదూ ?"

" మామ్మా - వొద్దు మామ్మా ! అలాంటి ఆలోచన కూడా నేను భరించలేను "

" భరించలేనంటే ఎలా ? నా మీద నీకు పీకల్దాకా కోపం వొచ్చినా సరే మధ్యాహ్నం చెప్పిన మాటే మళ్ళీ ఇప్పుడూ అంటున్నాను. నేను చెప్పినట్టు చేసి మీ అమ్మని కాపాడుకో ".

దుఃఖంతో వనజ గుండెలు ఎగిసిపడుతున్నాయి. కనపడని ఆ దేవుడికి కోటి దండాలు పెట్టుకుంటోంది.

" నేను చెప్పిన ఆ ఇల్లు గుర్తుందిగా నీకు ! ముగ్గురు బ్రహ్మచారులు అద్దెకున్నారా ఇంట్లో. ముగ్గురూ కూడా ఆడపిల్ల ' ఊ ' అంటే చాలు నోట్లు విరజిమ్మే రకాలే. ఆ సందులోనే మారుతీరావుగారని కుర్ర పంతులున్నాడు. ఆయనా అదే రకం మనిషి. వాళ్ళావిడ పుట్టింటి కెళ్ళినప్పుడల్లా ఆయనగారి మకాం రాత్రిళ్ళు ఈ బ్రహ్మచారుల కొంపలోనే. పేకాటేమిటి - మందు కొట్టడమేమిటి - గుట్టుచప్పుడు కాకుండా ఏ పిట్టనో పిలిపించుకోడమేమిటి అన్నీ ఉన్నాయి వాళ్ళకి " చెప్పుకుపోతోంది అన్నపూర్ణమ్మ.

దీర్ఘాలోచనలో మునిగిపోయింది వనజ.

" తప్పదు తల్లీ ! గుండె రాయిచేసుకోక తప్పదు.... మనబోటి దరిద్రులకి ఆ భగవంతుడి అండ కూడ అపురూపమే కదా ! మన బాగు మనమే చూసుకుంటే మంచిది. మంచిగా అడిగితే పైసా కూడా విడవని ఈ సంఘానికి భయపడి లాభం ఏముంది ? ఇదే మొదటిసారి, ఇదే చివరిసారీ అనుకుని మీ అమ్మకి మందులు కొనడంకోసం, ముందు వెనక లాలోచించకుండా వెళ్ళాలి మరి నువ్వు.... తప్పదు, ఎటొచ్చీ కాస్త గుండె నిబ్బరం కావాలంతే.... మీ అమ్మ దగ్గర నేను కూచుంటాన్లే వెళ్ళిరా...."

" మామ్మా ! ఆ మారుతీరావుగారి భార్య పేరు నీకు తెల్సా ?"

"ఆ.... తెల్సు. ఆవిడ పేరూ, నా పేరూ ఒకటే, అందుకే బాగా గుర్తుండిపోయింది.... అన్నపూర్ణ ఆవిడ పేరు. ఇప్పుడు ఊళ్ళో లేదావిడ. రోజూ చీకటిపడితే చాలు ఆ మారుతీరావుగారు బ్రహ్మచారుల కొంపలోనే వుంటున్నాడు.... ఇవాళ కూడా అక్కడే వున్నాడు ఇందాక చూశాన్నేను."

" ఆయన చేసే ఉద్యోగం ఏమిటి ? "

ఇవన్నీ ఎందుకడుగుతోందో అర్థంకాలేదు అన్నపూర్ణమ్మకి. అయినా చెప్పింది వివరంగా.

ఓ కాగితం, పెన్సిలూ తీసుకుని మారుతీరావు పేరు, ఉద్యోగం, వాళ్ళ ఇల్లున్న వీథి పేరూ రాసుకుంది వనజ. ఆ కాగితం, రెండు మూడు చీరలూ ఓ కాకీ సంచిలో పడేసుకుని బయల్దేరింది. ఆగకుండా కళ్ళు స్రవిస్తూనే వున్నాయి. ఆ కన్నీరు గుండెమంట నార్పలేకపోతోంది.

" మామ్మా.... వెళ్ళొస్తాను.... అమ్మని జాగ్రత్తగా చూసుకో నే నొచ్చేవరకూ.... మరి.... నా గురించి అడిగితే ఏమని చెప్తావు ? "

" ఏదో ఒకటి సర్ది చెప్పేస్తాన్లే. అసలు విషయం చెప్పన్లే నువ్వెళ్ళిరా.... కానీ.... ఈ సంచీ ఎందుకూ ? "

" అవన్నీ వొచ్చాక చెప్తాను " గబగబా వీథిలోకి నడిచింది వనజ. సన్నగా వానపడుతోంది.... చేతిలో సంచీ గుండెకి అదిమిపెట్టుకుని, వణుకుతున్న కాళ్ళని అదుపులో పెట్టుకుంటూ, ధైర్యంగా అడుగు ముందుకి వేసింది.

వీథి దీపాలు లేనిచోట చీకటి గర్వంగా రాజ్యమేలుతోంది. దీపాలు వున్నచోట గుడ్డి వెలుతురు సిగ్గుగా నవ్వుతోంది. పైట నిండుగా కప్పుకుని, తలవొంచుకుని త్వరత్వరగా నడుస్తోంది వనజ.

చావు బ్రతుకుల్లోవున్న తల్లి రూపమే కనిపిస్తోంది కళ్ళముందు. బాధతో విలవిల్లాడిపోతోంది మనసు. కంటికి రెప్పలా తనని పెంచి పెద్దచేసిన తల్లికి వైద్యం చేయించలేకపోతే ఇంక తన బ్రతుక్కి విలువేముంది ? ధర్మాసుపత్రిలో కూడా తమబోటి వాళ్ళని పట్టించుకునే వాళ్ళే కరువయ్యారు. ఎన్ని కష్టాలకో, ఎన్ని నష్టాలకో గురిఅయి, ఒంట్లో ఓపిక వున్నంతవరకూ, చివరి క్షణందాకా ఇక్కడా, అక్కడా పనులుచేసి ఒంట్లోవున్న శక్తినీ, రక్తాన్నీ ధారపోసి తనని ఇంతదాన్ని చేసిన అమ్మకి వైద్యం చేయించకుండా వొదిలేస్తే మనసొప్పుతుందా తనకి....అంతకన్నా మహా పాపం మరొకటి వుంటుందా ? తను పుట్టగానే తననీ, అమ్మనీ వొదిలేసి మరెవరినో చేసుకుని వెళ్ళిపోయాడు నాన్న....

ఎంత కఠినాత్ముడు కాకపోతే, అంత తేలిగ్గా బంధాలు తెంచుకుని వెళ్ళిపోతాడు. కానీ...అమ్మ !...ఈ బిడ్డకి తండ్రెవరంటూ కాకుల్లా పొడిచే ఈ లోకులకి జవాబు చెప్పుకోలేకపోయినా, ఆ పోట్లు భరిస్తూనే, తనని గుండెల్లో దాచుకుని, అష్టకష్టాలూ పడింది. కన్నబిడ్డ అన్న ప్రేమ నాన్నకి లేకపోయిందిగానీ, అమ్మకి తనంటే ఎంత ప్రేమ...లేకపోతే, ఏ రోడ్డు ప్రక్కనో తనని వొదిలేసేది పసికందుగా వున్నప్పుడే...తన బాగు తను చూసుకునేది...తండ్రెవరో చూపించలేని ఈ బిడ్డని పెంచి, లోకంచేత హీనంగా చూడబడడం ఎందుకని వొదిలించుకోలేదు తనని ధైర్యంగా పెంచి పెద్దచేసింది. అటువంటి అమ్మకోసం, ఆ ప్రాణం నిలబెట్టేందుకు తను చేయగలిగిన ప్రయత్నమంతా చేయక తప్పదు...డబ్బు తీసుకురావాలి. మందులు కొనాలి....అమ్మ ప్రాణం నిలబెట్టేందుకు తను ఒక అబద్దం ఆడినా ఫర్వాలేదు. తప్పదు మరి. నిజం చెప్తే సహాయంచేసే మనుషులు కరువైనప్పుడు అబద్దం ఆడినా పాపంలేదు....తనని ప్రేమించాననీ, పెళ్ళిచేసుకుంటాననీ తియ్యని కబుర్లు చెప్పిన శేషగిరి ఏడీ ? వాళ్ళమ్మావాళ్ళతో చెప్పి, ఒప్పించి, ఏకంగా పెళ్ళికి ముహూర్తం పెట్టించుకొస్తానని వెళ్ళాడు. నెల్లాళ్ళయింది వెళ్ళి. మనిషి అయిపులేడు.

అడ్రసు తెలీదు తనకి....వొచ్చేవాడైతే, మనస్ఫూర్తిగా తనని ప్రేమించిన వాడైతే, అప్పుడే, నాలుగురోజుల్లోనే ఊర్నించి వొచ్చి ఏ విషయమూ చెప్పేవాడు కాదూ ? ఇన్నాళ్ళెందుకవుతుంది ? తీరా, అక్కడికి వెళ్ళాక, వాళ్ళ పెద్దవాళ్ళు చెప్పిన అమ్మాయిని పెళ్ళిచేసేసుకుని వుంటాడు. 'మన పెళ్ళయ్యాక, మీ అమ్మ కూడా మన దగ్గరే వుండాలి. ఆవిడ బాధ్యత నీ ఒక్కదానిదే కాదు, నాది కూడాను' అంటూ ఎంత తియ్యగా, నమ్మకంగా చెప్పాడు కబుర్లు — అన్నీ నమ్మింది తను—చివరికి మిగిలింది నిరాశ—

*

"గురూ ! వరండాలో ఎవరో నిలబడ్డట్టున్నారు" చేతిలో ముక్కలు బల్లమీద బోర్లాపెట్టి, కళ్ళు చికిలించి చూస్తూ అన్నాడు చిట్టిబాబు. ముక్కలు చేతిలో సరిగ్గా సర్దుకుంటూ, అతి ముఖ్యమైన ప్రశ్న వేశాడు ఆచారి "ఎవరు ? ఆడా ? మగా ?"

"ఆడమనిషిలాగే కనపడుతోంది."

"వానగా వుంది కదా ! ఎవరో తలదాచుకుందుకు వొచ్చి నిలబడి వుంటారు" నోట్లో సిగరెట్టు గుప్పుమనిపించాడు రంగారావు.

మారుతీరావు మనసు ఉల్లాసంగా చిందులు తొక్కింది. లేచెళ్ళి, దగ్గరగా వేసున్న వీధి తలుపులు పూర్తిగా తీసి బయటికి చూశాడు. ఓ అడుగు వరండాలోకి వేశాడు.

"ఎవరు కావాలండీ ?"

"అబ్బే ! వానగా వుంటేనూ—కాసేపు ఈ వరండాలో నిలబడదామని—కాస్త తగ్గగానే వెళ్ళిపోతాను."

"మీ కభ్యంతరం లేకపోతే లోపలికొచ్చి కూర్చోండి. వరండాలో కూడా జల్లుకొడుతోంది కదా ?"

"ఎవరా వచ్చింది మారుతీరావు ?" ఉండబట్టలేక అడిగాడు ఆచారి లోపల్నించి.

'అయితే ఈయనే మారుతీరావన్నమాట' మనసులో అనుకుంది వనజ.

తడబడుతూ లోపలికి అడుగుపెట్టిన ఆ మెరుపుతీగని చూస్తూనే, మిగిలినవాళ్ళ చేతుల్లో పేకముక్కలు బల్లని కరుచుకున్నాయి.

"ఇలా కూర్చోండి" కుర్చీ చూపించాడు మారుతీరావు. ఆ మెరుపు తీగతో అతనొక్కడే మాట్లాడెయ్యడం నచ్చలేదు చిట్టిబాబుకి. మాట కలిపాడు తను కూడా.

"ఈ ఊరేనాండీ మీది ?"

"కాదండీ—చాలా దూరంనించి వొస్తున్నాను. అయిదు గంటలకే ఈ ఊరు రావల్సిన బస్సు, దోవలో చెడిపోవడంతో ఇంతాలస్యమైంది.... వానొకటి....పైగా నా పర్సెవడో కొట్టేశాడు బస్సు దిగుతుంటే ఆ రద్దీలో. రిక్షాకూడా డబ్బుల్లేవు—ఉద్యోగ ప్రయత్నంమీద ఈ ఊరొచ్చాను. నా అన్నవాళ్ళు లేరు—"

నలుగురు స్నేహితులూ ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకున్నారు— వాళ్ళ పెదవులమీద లీలగా నవ్వులు విరిశాయి. ప్లాస్కులో వున్న టీ ఓ కప్పులో పోసి ఆమెకి అందించాడు రంగారావు.

"వొద్దండీ—"

"ఫర్వాలేదు. తీసుకోండి—తడిశారు కదా ! వేడి పుట్టిస్తుంది—"

అతని కళ్ళల్లోకి చూసి నవ్వింది వనజ. అందుకుంది టీ. ఐసయిపోయాడు అతను. బయట వాన జోరు హఠాత్తుగా ఎక్కువైంది.

" ఏవండీ మీరేమీ అనుకోకపోతే — ఓ చాపగానీ, మరేదన్నాగానీ ఇస్తారా ? ఆ గది ఖాళీయే ననుకుంటాను. కాసేపు అక్కడ నడుం వాలుస్తాను. వర్షం కొంచెం తగ్గగానే వెళ్ళిపోతాను. బస్సు ప్రయాణంలో ఒళ్ళు హూనమైంది " అంటూ ఒళ్ళు విరుచుకుంది టీ తాగడం అయ్యాక.

ఆమె ఆ గదిలో అడుగుపెట్టిన ఓ అయిదు నిమిషాలకి మారుతీరావు మెల్లిగా చేరాడక్కడికి, కిటికీ దగ్గిర నిలబడి బయటికి చూస్తున్న వనజ వెనక్కి తిరిగింది. పెదవులు విడీవిడకుండా అందంగా చిరునవ్వు నవ్వింది. ధైర్యం వొచ్చింది అతనికి—నా అన్నవాళ్ళెవరూ లేరని చెప్పిందిగా ! ఇంక భయమెందుకూ ? ఇకిలిస్తూ భుజమ్మీద చెయ్యి వేశాడు. ఆమె మౌనంతో అతనికి మరింత హుషారొచ్చింది. చేతులు మెల్లిగా ఆమె నడుం చుట్టూ వేశాడు.

" వొదలండి. "

" ఉహూ— "

" మీరు పొరబడుతున్నారు. నేను మీ రనుకుంటున్నలాంటిదాన్ని కాదు - నా స్నేహితురాలి ఇల్లు ఈ చుట్టుప్రక్కలే ఎక్కడో వుంది - కష్టపడి ఎవర్నో అడిగి ఎలాగైతేనేం తన అడ్రసు తెచ్చుకున్నాను. చాలా కాలమైంది మేమిద్దరం కల్సుకుని - వర్షం తగ్గగానే వాళ్ళింటికి వెళ్ళిపోతాను " అంటూ సంచిలోంచి తను రాసుకొచ్చిన కాగితం తీసి అతని చేతికందించింది.

" మీకు తెలిస్తే చెప్పండి ఆ అడ్రసుకి ఎలా వెళ్ళాలో ? "

అది చదువుతూనే, నెత్తిన పిడుగు పడినట్టయింది మారుతీరావుకి.

" మీకు - మీకు ? " మాటే రావట్లేదు నోట్లోంచి.

" అన్నపూర్ణ నా స్నేహితురాలు "

" వాళ్ళాయన్ని ఎప్పుడూ చూడలేదా మీరు ?" గుటకలు మింగుతూ అడిగాడు.

" లేదండీ - "

మారుతీరావుకి కాళ్ళూ, చేతులూ ఆడడం లేదు. మొహంలో భావాలు కనిపించకుండా జాగ్రత్తపడుతూ అన్నాడు. " వాళ్ళు నాకు బాగా తెలుసు. ఈ మధ్యే వాళ్ళకి ట్రాన్స్‌ఫర్ అయి, ఈ ఊర్నించి వెళ్ళిపోయారు. ఇంక ఈ ఊరు రారు. మీరు మీ ఊరెళ్ళిపోవడం మంచిది. తెల్సిన వాళ్ళెవరూ లేకుండా మీరొక్కరూ ఇలా పొరుగూళ్ళో ఎందుకు కష్టపడటం ? "

పంటిబిగువున నవ్వాపుకుంది వనజ తలవంచుకుని.

" అయ్యో ! వాళ్ళిప్పుడీవూళ్లో లేరా ? వాళ్ళున్నారన్న ధైర్యంతోనే ఈ ఊరొచ్చాను. అయితే, ఇంకొంచెంసేపట్లో మా ఊరికి బస్సుంది.... వెళ్ళిపోడం మంచిది. "

" ఔనౌను. అదే మంచి పని " అంటూనే గదిలోంచి అవతలికి వెళ్ళి, స్నేహితుల్తో గొంతు తగ్గించి అసలు విషయం చెప్పాడు. " మా ఆవిడ స్నేహితురాలుట. నా పరువు దక్కించండిరా.. లేకపోతే మా ఆవిడకి తెల్సిందంటే ఇంక నా పని ఇంతే సంగతులు" ఏడుపొక్కటే తక్కువగా వుంది మారుతీరావు పని. అభయహస్తం ఇచ్చారు స్నేహితులు. నలుగురూ నాలుగు పాతికలు జేబుల్లోంచి తీశారు. ఆ వందా తనే ఆమె చేతిలో పెట్టాడు మారుతీరావు.

" మీ పర్సు పోయిందన్నారుగా... ఈ డబ్బు వుంచండి. పాపం తిరుగు ప్రయాణానికి కావాలిగా...వొద్దనకండి...ఇంకొంచెంసేపట్లో బస్సుందన్నారుగా మీ ఊరికి, ఆలస్యం చెయ్యకుండా వెళ్ళిపోడం మంచిది.. లేకపోతే ఇబ్బంది పడిపోతారు..."

" థ్యాంక్సండీ ...మీ మేలు మర్చిపోను...అదిగో వాన కూడా తగ్గింది..."అంటూ ఆ నలుగురు మగమహారాజులకీ చేతులు జోడించి ఓ నమస్కారం పడేసి బయటపడింది. తన ధైర్యానికి తనే ఆశ్చర్యపోతూ ఇంటిముఖం పట్టింది.